కాల్చితే కాలుష్యం.. దున్నేస్తే సారవంతం

- వరిగడ్డిని భూమిలో కలియదున్నితే పెరగనున్న సారం
- కాల్చితే భూమిలో తేమ శాతం తగ్గుతుంది
- మిత్ర కీటకాలు, శిలీంద్రాలు చనిపోతాయి


చింతకుంట వద్ద వరిగడ్డిని పొలంలోనే కాల్చేసిన దృశ్యం


కానాల సమీపంలో పొలంలో వరిగడ్డిని కాల్చివేస్తున్న దృశ్యం

గోస్పాడు: వరి పంట అనంతరం ఎండుగడ్డి, వరి మొళ్లను తగలబెట్టడం వల్ల పొలాలకు తీవ్ర నష్టం కలుగుతుందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. వేడి వల్ల భూమిలో ఉన్న మిత్ర కీటకాలు, శిలీంద్రాలు చనిపోయి పైరుకు నష్టం కలుగుతుంది. సాగులో కూలీల కొరతను అధిగమించడానికి, సాగు ఖర్చులు తగ్గించుకోడానికి రైతులు ఎక్కువగా యంత్రాలను వినియోగిస్తున్నారు. యంత్రాల ద్వారా నూర్పిడి పూర్తయిన అనంతరం వరిగడ్డి, మొళ్లను తగలబెట్టడం ఇటీవల సాధారణంగా మారింది. వరి మాసూళ్లలో వరికోత యంత్రాలను ఉపయోగించడంతో పాటు పశువుల సంఖ్య తగ్గడం . కూలీల ఖర్చు పెరగడంతో వరిగడ్డిని గతంలో మాదిరిగా రైతులంతా ఒబ్బిడి చేయడం లేదు. దీంతో యంత్రాలతో మాసూళ్లు చేసిన చేలలో గడ్డిని కొందరు రైతులు తగలబెడుతున్నారు.

నష్టాలు..

- రైతులు పొలంలో గడ్డిని మండించడం వల్ల కలిగే వేడి భూమిలో సుమారు సెంటి మీటరు లోతు వరకు వెళ్తుంది.
- దీని వల్ల క్రమేపీ భూములు నిర్జీవంగా మారే అవకాశం ఉంది.
- వేడి వల్ల మిత్ర కీటకాలు, మిత్ర శిలీంద్రాలు చనిపోయి పంటలను ఆశించే చీడపీడల ఉధృతి క్రమేపీ పెరిగిపోతుంది.
- టన్ను గడ్డిని తగులబెట్టడం వల్ల నేలలో 5.5 కిలోల నత్రజని, 2.8 కిలోల పాస్పరస్, 2.5 కిలోల పొటాషియం, 1.0 కిలోల సల్ఫర్ తో పాటూ నేలలో ఉండే సేంద్రియ కర్బనాన్ని కూడా కోల్పోతుంది.
- గడ్డి తగలబెట్టడం వల్ల వచ్చే పొగను పీల్చడం వల్ల నుశి ఊపిరితిత్తులలో పేరుకుపోయి ఆస్తమా తదితర శ్వాస సంబంధ రుగ్మతలు ఏర్పడే అవకాశం ఉంది.

పంట వ్యర్థాల సమర్థ వినియోగానికి ప్రత్యామ్నాయాలు..

- పొలంలో మిగిలిన గడ్డిని కంపోస్ట్ చేయడం వల్ల ఎంతో విలువైన సేంద్రియ ఎరువుగా మారుతంది.
- సేంద్రియ ఎరువుల వినియోగం పర్యావరణ హితమైనవే గాక సాగు ఖర్చును తగ్గించుకోవచ్చు.
- వరి గడ్డి పుట్టగొడుగుల పెంపకంలో బెడ్డింగ్ మెటీరియల్‌గా ఉపయోగపడుతుంది.
- కొన్ని ప్రైవేటు సంస్థలు వరిగడ్డిని ఉపయోగించి ప్యాకింగ్ మెటీరియల్, ఇతర ఉత్పత్తులు తయారు చేస్తున్నందున గడ్డిని విక్రయించుకోవడం ద్వారా కొంత ఆదాయం పొందవచ్చు .

రైతుల్లో అవగాహన పెరగాలి

చేలల్లో వరిగడ్డిని తగలబెట్టడం వల్ల అనేక అనర్థాలు చోటుచేసుకుంటాయి. గడ్డి తగలబెట్టినప్పుడు వేడి వల్ల భూమికే గాకుండా మనుషులకు తీవ్ర నష్టాలున్నాయి. గడ్డిని సమర్థగా వినియోగించుకోవడం వల్ల పర్యావరణానికి మేలు కలగడమేగాక రైతులు అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చు. వరి గడ్డిని చేలలో దుక్కిదున్నడం వల్ల పైరుకు సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది. రైతులు అవగాహన పెంచుకుంటే పర్యావరణ రక్షణతో పాటు పొలాలను సారవంతంగా మార్చుకోవచ్చు.

– స్వప్నికారెడ్డి, వ్యవసాయాధికారిణి, గోస్పాడు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

నంద్యాల(అర్బన్): చెట్లు ప్రగతికి మెట్లు అని.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేయాలని నంద్యాల రూరల్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆరోగ్యమ్మ కోరారు. మండలంలోని చాపిరేవుల గ్రామ అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ టీచర్ ఆదిలక్ష్మి, ఆయా తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీ విత్తానాలివ్వాలి

కొత్తపల్లి: ముందస్తు వర్షాలు కురుస్తున్నాయని, రైతులు పొలాలను ఖరీఫ్ సాగుకు సిద్ధం చేసుకుంటున్నారని, ప్రభుత్వం వెంటనే సబ్సిడీ విత్తనాలు మంజూరు చేసి అన్నదాతలకు అండగా నిలవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రాజశేఖర్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.స్వాములు కోరారు. శుక్రవారం మండలంలోని శివపురం, చిన్న గుమ్మడాపురం, ముసలమడుగు గ్రామాల్లో ఏపీ రైతు సంఘం సభ్యత్వ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. వారు మాట్లాడుతూ బహిరంగా మార్కెట్‌లో విత్తనాలు ధరలు మండుతున్నాయని, అధికారులు వెంటనే విత్తనాల పంపిణీకి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు సంజీవ, వీరన్న, రాయుడు, దాసు, గోపాల్, జ్ఞాన సూర్యుడు, దేవ కుమార్, సత్యరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు


అమ్మవారికి మంగళ హారతి ఇస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం చేపట్టి ప్రత్యేకంగా అలంకరించారు. ఒడి బియ్యం, పుష్పాభిషేకం కార్యక్రమాలు జరిపించి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం రాహుకాల పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పుస్తక పఠనంతో నైతిక విలువలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న రిటైర్డ్ న్యాయమూర్తి శివప్రసాద్

ఆళ్లగడ్డ: పుస్తక పఠనం వల్ల వ్యక్తుల్లో నైతిక విలువలు పెంపొందుతాయని రిటైర్డ్ న్యాయమూర్తి శివప్రసాద్, ఎస్‌ఐ నగీన అన్నారు. స్థానిక గ్రంథాలయంలో నెల రోజుల పాటు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి అరుణకుమారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు.. వివిధ అంశాల్లో శిక్షణ పొంది పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

బీజేపీ నాయకుల సంబరాలు


సంబరాలు చేసుకుంటున్న నాయకులు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా బీజేపీ పార్లమెంటరీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కో ఆర్డినేటర్ అభిరుచి మధు ఆధ్వర్యంలో రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్‌డీకే కూటమి విజయం సాధించడంతో బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. మధు మాట్లాడుతూ కేంద్రంలోని మూడో సారి నరేంద్రమోదీని ప్రధానమంత్రిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం సంతోషించదగ్గ విషయమన్నారు. నాయకులు కొట్టె కృష్ణమూర్తి, చంద్రశేఖర్, స్వామిరెడ్డి, స్వాతి, రామకృష్ణారెడ్డి, రమేష్, రామసుబ్బారెడ్డి, గురుబ్రహ్మం, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

మురుగు పోయే మార్గం చూపండి!


రోడ్డుపై నిలిచిన మురుగునీరు

నంద్యాల(అర్బన్): మురుగునీరు రహదారిపై ప్రవహిస్తుండటంతో నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని బిల్లలాపురం గ్రామ బీసీ, ఎస్సీ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షా కాలంలో మోకాలి లోతు నీరు నిలుస్తుండటంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామన్నారు. సీసీ రోడ్డు నిర్మించిన అధికారులు డ్రైనేజీ ఏర్పాటు చేయకపోవడంతో సమస్య నెలకొందన్నారు. మురుగు కాల్వలు నిర్మించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు.

ఐక్యపోరాటాలతో సమస్యల పరిష్కారం

ఆత్మకూరు: కార్మికులు, ఉద్యోగులు ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ధనుంజయ సమావేశ భవనంలో సీఐటీయూ జనరల్‌బాడీ సమావేశం పట్టణాధ్యక్షుడు రజాక్ అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ కార్మికులపైన అదనపు పనిభారం మోపి వ్యాపారులు లాభాలను ఆర్జిస్తూ మరింత కోటీశ్వరులుగా మారుతున్నారని, కార్మికులు పెరుగుతున్న ధరలను భరించలేక ఏమి తినగలిగే పరిస్థితుల్లో లేరన్నారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ సివిల్ కోడ్‌లుగా కుదింపు చేశారని మండిపడ్డారు. ప్రభుత్వరంగ సంస్థలను పెట్టుబడుదారులకు, కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా అప్పజెప్పి ప్రభుత్వ ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సీఐటీయూ ఉపాధ్యక్షుడు రణధీర్, నాయకులు జాబివుల్లా, రాముడు పాల్గొన్నారు.

మోటారు, పైపుల విరాళం


నూతన మోటారుకు పూజలు నిర్వహిస్తున్న దాతలు, పండితులు

మహానంది: దేవస్థానం పొలంలో సాగవుతున్న పశుగ్రాసం కోసం వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన బొగ్గరపు సుబ్రహ్మణ్యం, సుమిత్ర దంపతులు శుక్రవారం రూ.లక్ష విలువైన విద్యుత్ మోటార్‌తో పాటు పైపులను అందించారు. పొలం వద్ద ఏఈఓ ఓంకారం వేంకటేశ్వరుడు, వేదపండితులు హనుమంత శర్మ, గోశాల అర్చకులు శరభయ్యశర్మ ఆధ్వర్యంలో పూజలు చేసి ప్రారంభించారు. గోవుల ఆకలిని తీర్చేందుకు పెంచుతున్న పశుగ్రాసం కోసం మంచినీటి మోటారు అందించి భాగస్వాములవడం శుభప్రదమన్నారు. గోవులకు సేవ చేయడం ద్వారా ఎంతో పుణ్యఫలం లభిస్తుందని దేవస్థానం వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు.

సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలని వినతి


డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): సార్వత్రిక ఎన్నికల సమయంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందిపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలని ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ నేతలు జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావును కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీసీహెచ్ వెంగల్‌రెడ్డి, కార్యదర్శి జవహర్ లాల్, నగర శాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న, కేసీహెచ్ కృష్ణుడు, 4వ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మద్దిలేటి తదితరులు వినతిపత్రం సమర్పించారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో డీఆర్‌ఓకు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు.

గరుకులాల్లో సీట్లు పెంచాలి


డీసీఓకు వినతి పత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కర్నూలు కల్చరల్: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో అదనంగా సీట్లు పెంచాలని డీసీఓ శ్రీదేవికి శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ.. గురుకులాల్లో సీట్ల కోసం ప్రవేశ పరీక్ష రాసి చాలా మంది విద్యార్థులు అర్హత సాధించారన్నారు. సరిపడే సీట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. బీసీ ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమైఖ్య జిల్లా అధ్యక్షుడు శేఖర్ నాయుడు, నాయకులు తిరుపాల్, రాజు, విజయ్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

రేనాటిగడ్డ ఖ్యాతి చాటిన బీవీ


బీవీ సుబ్బారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: కోవెలకుంట్లకు చెందిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, శాసనసభ స్పీకర్ దివంగత బీవీ సుబ్బారెడ్డి రేనాటిగడ్డ ఖ్యాతిని దేశ నలుమూలలా చాటారని వక్తలు కొనియాడారు. బీవీ 50వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక గ్రామ పంచాయితీ కార్యాలయం పక్కన ఉన్న పార్కులో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి, సీపీఎం జిల్లా నాయకుడు సుధాకర్, రాయలసీమ విద్యార్థి సంఘం నాయకుడు ఓబులేసు బీవీ సేవలను గుర్తు చేశారు. ఉపముఖ్యమంత్రిగా, స్పీకర్ పదవులకు బీవీ వన్నె తెచ్చారన్నారు. మాజీ సైనిక ఉద్యోగి సహదేవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, రఘు, బీవీ అభిమానులు ఓబన్న, కృష్ణారెడ్డి, మద్దిలేటి, పుల్లయ్య పాల్గొన్నారు.

సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోండి


రెన్యూవల్ చేయించుకుంటున్న రైతులు

జూపాడుబంగ్లా: మండలకేంద్రంలో ఉన్న 80బన్నూరు సహకార సొసైటీలో సభ్యులుగా ఉన్న రైతులు వారి సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవాలని సొసైటీ చైర్మన్ వెంకటరమణ, సీఈఓ చంద్రశేఖర్‌గౌడు తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ సొసైటీలో 6,150 మంది సభ్యులున్నారని, వారి రేషన్‌కార్డు, ఆధార్, పాన్‌కార్డు పట్టాదారు పాసుపుస్తకం, నామిని ఆధార్‌కార్డు జిరాక్సులతో పాటు మూడు ఫొటోలతో కార్యాలయంలో దరఖాస్తును పూరించి సభ్యత్వాన్ని రెన్యూవల్ చేయించుకోవాలని కోరారు. రెన్యూవల్ చేయించుకొన్న వారికి ఖరీఫ్ పంట రుణాలు మంజూరవుతాయని చెప్పారు.

రాయితీపై కంది విత్తనాలు

గడివేముల: మండల పరిధిలోని ఆర్బీకేలలో 30 శాతం సబ్సిడీతో కంది విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు ఏఓ హేమసుందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. కంది ఎల్ఆర్‌జీ-51, ఎల్ఆర్‌జీ-105 రకాల విత్తనాలు ఉన్నాయని.. కావాల్సిన రైతులు స్థానిక ఆర్‌బీకేలలో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కేజీ రూ. 140 ఉండగా రాయితీ రూ.42 పోను రూ.98 చెల్లించాలన్నారు. అవసరమైన రైతులు పాస్ పుస్తకం, ఆధార్ కార్డుతో ఆర్‌బీకేలో సంప్రదించాలని సూచించారు.

మహానందీశుడి పల్లకీ సేవ వాయిదా

మహానంది: మండలంలో జోరుగా కురుస్తున్న వర్షంతో శ్రీ మహానందీశ్వరస్వామి పల్లకీ సేవ వాయిదా పడింది. క్షేత్రంతో పాటు పరిసర గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు నిరంతరాయంగా వర్షం కురిసింది. దీంతో స్వామి,అమ్మవార్ల పల్లకీ సేవ రద్దు చేసినట్లు ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

గడివేముల: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శైలజ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్‌తో పాటు తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలను పాఠశాలలో అందజేయాలన్నారు. ప్రవేశ పరీక్ష ఆధారంగా సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.

మహానందిలో కొనసాగుతున్న భక్తుల సందడి

మహానంది: క్షేత్రంలో శుక్రవారం భక్తుల రద్దీ కొనసాగింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పలు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఉచిత దర్శనం, ఆర్జిత సేవాటికెట్లు, మహాదాశీర్వచనం, అభిషేకం సేవల ద్వారా భక్తులు స్వామివారి సేవలో పాల్గొని తరించారు. ఉదయం , సాయంత్రం జరిగిన అష్టవిధ మహా మంగళ హారతుల సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

మహిళ ఆత్మహత్య

మిడుతూరు: మండలంలోని తలముడిపి గ్రామంలో ఓ మహిళ కడుపు నొప్పి తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కురువ మహేశ్వరి (24) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతూ ఉండేది. గురువారం నొప్పి ఎక్కువ కావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి పడిపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం కోలుకోలేక మృతి చెందింది. మృతురాలికి భర్త సంజీవ, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

చదువు కొనాల్సిందే!

- ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రారంభమైన అడ్మిషన్లు
- తడిసి మోపెడవుతున్న ఫీజులు
- ఎల్‌కేజీ రూ.20వేలు, పదవ తరగతి రూ.60వేలు
- పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్, బూట్లు వారి వద్ద కొనాల్సిందే
- సర్కారు బడుల్లో ఇవన్నీ ఉచితం

నంద్యాల(న్యూటౌన్): 'మేం చదువుకోకపోవడంతో కష్టాలు పడుతున్నాం.. మా బిడ్డలనైనా పట్నంలో ఉండే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చదివిస్తే, ఏ ప్రభుత్వ ఉద్యోగమో.. ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగమో సంపాదించుకుంటారు.. వాళ్ల జీవితాలు బాగుంటాయి..' ఇదీ సగటు తల్లిదండ్రుల ఆలోచన. వారి అవకాశాన్ని ఆసరాగా చేసుకొని కాసుల వేటకు తెగబడుతున్నాయి అధిక శాతం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు. వివిధ రకాల కోర్సులు పేరుతో ఫీజుల పెంచేసి సొమ్ము చేసుకుంటున్నారు. వీటికి అదనంగా నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, తదితరాలు వారి వద్ద కొనాల్సిందే. దీంతో విద్య వ్యాపారం మూడు పుస్తకాలు, ఆరు అడ్మిషన్లతో వికసిల్లుతోంది.

అన్నీ అక్కడ కొనాల్సిందే..

నోట్ పుస్తకాల నుంచి పెన్ను, పెన్సిల్ వరకు వారి వద్దే కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తున్నాయి విద్యాసంస్థలు. ఒక విద్యార్థిని చదివించాలంటే అన్ని ఫీజులు కలిపి తడిసి మోపెడవుతున్నాయి. ఇంతింత ఫీజులు చెల్లించి ఇంకేం చదివిస్తాం అని నిట్టూరుస్తున్నారు. నంద్యాల నియోజకవర్గంలో 526 ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. వీటి పరిధిలోని 2024-25 విద్యా ఆకాడమీకి ఏడాదికి తరగతుల వారీగా అడ్మిషన్లు ప్రారంభించారు. పాఠశాలలు పునఃప్రారంభించిన తర్వాత ప్రవేశాలు చేపట్టాల్సి ఉంది. దీనికి విరుద్ధంగా కొందరు యజమానులు వ్యవహరిస్తున్నారు.

ఏటేటా పెరుగుతున్న ఫీజులు..

ఎల్కేజీ విద్యార్థులకు సగటున రూ.20 వేలు, పదో తరగతి విద్యార్థులకు రూ.50 వేల నుంచి రూ.60 వేలు ఫీజు వసూలు చేస్తున్నారు. వీటికి తోడు పాఠశాలల్లోనే పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, టై, బెల్టు తప్పనిసరిగా కొనుగోలు చేయాలి. బహిరంగ మార్కెట్‌లో అవే వస్తువులు 10 నుంచి 15శాతం తక్కువ ధరకు లభిస్తున్నాయి. అక్కడ కొనుగోలు చేద్దామంటే అనేక ఆంక్షలు విధిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారమైనా సరే తల్లిదండ్రులు భరిస్తున్నారు. ఇక రవాణాకు అదనంగా వసూలు చేస్తూ మరింత భారం నెత్తినేస్తున్నారు.

సౌకర్యాలు అంతంత మాత్రమే..


ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో తరగతి గదుల్లో వెలుతురు, స్వచ్ఛమైన గాలితో పాటు శుభ్రత ఉండాలి. ఇలాంటివి చాలా తక్కువ కనిపిస్తాయి. వెలుతురు లేకపోగా, ఫ్యాన్లు కూడా సక్రమంగా తిరగని పరిస్థితి. మెజార్టీ పాఠశాలల్లో పిల్లలు ఆడుకోవాడానికి మైదానాలు లేవు. స్టడీ అవర్స్ పేరుతో ఉదయం 7 నుంచి సాయంత్రం 7గంటల వరకు గదుల్లోనే బంధిస్తున్నారు. దీంతో విద్యార్థుల్లో మానసిక వికాసం తగ్గిపోతుందని మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్రభుత్వ బడుల్లో అధునాతన సౌకర్యాలు..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక విద్యా సంస్కరణలు ప్రవేశపెట్టారు. 59 నెలల పాలనా కాలంలో ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చివేశారు. నాడు- నేడుతో కార్పొరేట్‌కు ధీటుగా బడులను రూపుదిద్దారు. బైలింగ్వల్ పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, విద్యా కానుక ద్వారా షూ, టై, బ్యాగు అన్నీ ఉచితంగా అందిస్తున్నారు. ప్రతి విద్యార్థికీ మూడు జతల యూనిఫాం, స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటయ్యాయి. మెనూ అమలు చేస్తూ, రోజుకో రకం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో చేర్పిస్తే అన్ని ఉచితమే.

పాఠశాలల్లో ఉండాల్సినవి..

- విద్యార్థులకు సరిపడా గదులు వసతులతో కూడా ఉండాలి. భవన నిర్మాణ నాణ్యత ధ్రువీకరణ పత్రం ఉండాలి.
- విద్యార్థుల మానసిక ఎదుగుదల కోసం ఆట స్థలం , లైబ్రరీ, ప్రహరీ, అగ్నిమాపక శాఖ జారీ చేసిన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఉండాలి.
- తాగునీటి వసతి, ప్రథమ చికిత్స సౌకర్యం, కంప్యూటర్ గది, మూత్రశాలలు, మరుగుదొడ్లు కచ్చితంగా ఏర్పాటు చేయాలి.
- విద్యాహక్కు చట్టం ప్రకారం బీఎడ్, డీఎడ్ పూర్తి చేసిన ఉపాధ్యాయులతో బోధన చేయించాలి.
- పిల్లలు రోడ్డు దాటడానికి సౌకర్యం కల్పించాలి. ఫీజుల వివరాలు నోటీసు బోర్డుపై అతికించాలి. ప్రభుత్వ పుస్తకాలతోనే బోధన సాగించాలి.
- ఒక గదిలో 40 మంది విద్యార్థులు దాటితే మరో సెక్షన్ కోసం అనుమతి తీసుకోవాలి. ప్రీ ప్రైమరీ కోసం అనుమతి తీసుకోవడం, అందుకు తగ్గట్లుగా వసతులు ఉండాలి.



అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

బడులు పునః ప్రారంభించిన తర్వాతే అడ్మిషన్లు చేపట్టాలి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు చేపడతాం. ముఖ్యంగా అధిక ఫీజులు వసూలు చేస్తే, పాఠశాలల యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలకు ఆదేశిస్తాం. ప్రతి పాఠశాలలోనూ ఫీజులను బోర్డుపై ప్రదర్శించాలి. పాఠశాలల్లో తనిఖీలు చేపట్టి, ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేస్తాం. వసతులన్నీ ఉండేలా యజమానులు చూసుకోవాలి.


– బ్రహ్మంనాయక్, ఎంఈఓ, నంద్యాల


గుండుపాపలలో పొంగి ప్రవహిస్తున్న వాగులు


దబ్బ్యా గోవిందిన్నె సమీప పొలాల్లో పారుతున్న వర్షపునీరు

కుండపోత

డొర్నిపాడు: మండలంలో శుక్రవారం తెల్లవారు జామునుంచి భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. అలాగే క్రిష్టిపాడు వద్ద కుందూనదికి వరదనీరు చేరడంతో ఉధృతంగా ప్రవహిస్తుంది. బ్రిడ్జికి కేవలం అడుగు ఎత్తులో నీరు ప్రవహిస్తోంది. ఈసారి వర్షాలు ఆశాజనకంగా ఉన్నాయని, పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.రెట్టింపు చెల్లించి రైతులు పొలాలను తీసుకుంటున్నారు.


క్రిష్టిపాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కందూనది